# పూజకు వేళాయెరా

## ( హాస్య నాటిక )

- శంకరమంచి పార్థసారథి

పాత్రధారులు

1. కేశవరావు
2. పాండురంగం
3. ఐరావతం
4. కోయవాడు.
5. కానిస్టేబులు
6. వసంత లక్ష్మి

# పూజకు వేళాయెరా

## ( హాస్య నాటిక )

- శంకరమంచి పార్థసారథి

తెర తొలిగేసరికి అదొక మధ్య తరగతి ఇంట్లో ఒక గది. సాధారణమైన అలంకరణ, గోడలకి పాత క్యాలండర్లు, ఫోటోలు వగైరా కనిపిస్తున్నాయి. గది మధ్యగా బల్లపైన టెలిఫోన్ కూడా వుంది.

స్టేజీ ఖాళీగా వుంది. అంతలో టెలిఫోన్ మ్రోగింది. కేశవరావు లోపల్నుంచి వచ్చేడు. ఇంకా రాత్రి దుస్తుల్లోనే వున్నాడు. భుజానికి టవలు కూడా వ్రేలాడుతోంది. ఫోన్ వద్దకెళ్ళి రిసీవర్ని చేతిలోకి తీసుకుని చాలా విసుగ్గా మాట్లాడసాగాడు.

కేశవరావు : హల్లో....ఆ .....కాదండి...కాదు కానే కాదు....ఇది బృందావన్ లాడ్జింగ్ కాదయ్యా బాబూ – రాంగ్ నంబర్. అంచేత త్వరగా పెట్టేయ్. ఏమిటీ ? మడతమంచాలు, గదులు చవగ్గా దొరికే హొటలు పేరు చెప్పాలా ? ఇక్కడ నేనేమన్నా " మే ఐ హెల్ప్ యు " అంటూ బోర్డు కట్టేననుకున్నారా ? ఏమిటి వూరికి కొత్తా ? అయితే వెళ్ళి గోదావర్లో దిగు ఏవిటి గోదావర్లోంచే దిగావా ? మైగాడ్ ( ఫోన్ పెట్టేసి మొహం తుడుచుకుంటూ ) ఛ....ఛ.... పొద్దున్నే వెధవ రాంగ్ నంబర్లు వెధవ రాంగ్ నెంబర్లాని.....తెల్లారి లేచిన దగ్గర్నుంచి పడుకునేదాకా ఇదే వరస....దీన్ని కాస్తా పీకి పారెయ్యవయ్యా అంటే, ఆ ఓనరు ఇదిగో అదిగో అంటాడాయె. ఫోన్ వాడిదే అయినా పనిష్మెంటు మాత్రం నాకు ఛ....ఛ..... ( అంటుండగా మళ్ళీ ఫోన్ మ్రోగడంతో అతడు దానివైపు కోపంగా చూస్తూ ) మళ్ళీ రాంగ్ నెంబరే ....సందేహం వుండక్కర్లేదు ....మ్యాట్నీ టిక్కెట్లు వున్నాయా అనో, మద్రాసు బండిలో బెర్తులున్నాయా అనో ( ఫోన్ చేతిలోకి తీసుకుని ) హల్లో.... అ... ఏమ్మా ఏం నంబరు కావాలి ? నీక్కూడా గదులు, మడతమంచాలు చవగ్గా దొరికే వసతి గృహాల అడ్రస్సు కావాలా ? ఆ .... ( కంగారుగా ) అత్తగారా ?

నేనండీ కేశవరావును.... అబ్బే ఆ వాగింది నే కాదులెండి. వేరే లైను.మీ అమ్మాయి లోపలుంది. పిలుస్తా లైన్లో వుండండి

( రిసీవర్ని బల్లపైన వుంచేడు )

వసంతా – వసంతా – ఓ వసంతలక్ష్మి !

వసంత : ఆ – వస్తున్నా ( లోపల్నుంచి వినిపించింది ఆ పైన వచ్చింది తల స్నానం చేసినట్లు తలకి పిడప వేసుకుంది ) పిల్చేరా !

కేశవ : ఏవిటి ఇంత అరిచినా ఇంకా డౌటా ? మీ అమ్మ ఫోన్ చేసింది మాట్లాడు.

వసంత : ( ఫోన్లో మాట్లాడుతోంది ) అమ్మా – ఆ – నేనే– ఇప్పుడే స్నానం అయింది. ఇహ బజారెళ్ళి పూజ సామాగ్రి తెచ్చుకోవాలి. వ్రతం రోజున మొగుళ్ళ చేత చాకిరీ చేయించకుండా బజారు పన్లు కూడా స్వయంగా చేసుకుంటే ఫలం వుంటుందన్నావుగా ! అందుకే – ఫలం బావుండాలే గాని ఓ తులం కష్టపడితే ఏం పోయింది ! అద్సరే – నీ పూజ మొదలైందా ! ఇంకా లేదా ? అలంకారం జరుగుతోందా ! ఆ – భోజనానికి పూజ పూర్తిచేసుకుని అక్కడికి రమ్మంటావా ! అలాగే ఓ – వుంటా ( ఫోన్ ఎట్టేసింది )

కేశవ : ఏమిటీ ఏదో వ్రతం, పూజా అంటున్నావ్; కొత్త కార్యక్రమమా ? ఇంతకీ ఏ వ్రతం ?

వసతం : సౌభాగ్య వ్రతం

కేశవ : ఓహో – సౌభాగ్య వ్రతమా ? అంటే అయిదోదనం కోసం...

వసంత : కాదు – కాదు – ఆరోతనం కోసం

కేశవ : ఆరోతనమా ! వసంతా ! ఇదేదో కొత్త తనంలా వుందే – ఎప్పుడూ విన్నట్లుగా లేదు.

వసంత : ఫ్చ్ – మీకు చెప్పినా అర్థం కాదు. మొదటేడు కదా – చేసి చూపించాల్సిందే – దీన్ని సౌభాగ్య వ్రతం అంటారు. దీన్ని గాని ప్రతి ఏడూ నిష్టగా చేసుకంటే వచ్చే జన్మలో మంచి మొగుడొస్తాడట్ట. అమ్మ చెప్పింది.

కేశవ : ( అనుమానంగా ) అంటే....మీ అమ్మగూడా ఇంకా వ్రతాలూ ...పూజలూ...?

వసంత : సర్లెండి ....మా అమ్మ చేసుకున్నంత నిష్టగా నేనెక్కడ చేయగల్ను. ఈ రోజంతా మా నాన్న దేవుడి మందిరంలోనే వుంటాడు.

కేశవ : అంటే – సౌభాగ్య వ్రతం రోజున మొగుళ్ళు దేవుడి మందిరాల్లో కూర్చోవాలా ?

వసంత : ఏవండీ – ఈ ఒక్క రోజూ నే చెప్పినట్లు వినండి.... ప్లీజ్ – క్రితం జన్మలో బద్దకించివుంటాం, అందుకే మన బతుకులిలా వున్నాయ్. కనీసం ఈ జన్మలోనైనా నిష్టగా చేసుకోవే అమ్మడూ అంటూ ఒకటే గోల – అమ్మ ”

కేశవ : ఏవిటేవిటీ ? అంటే మీ అమ్మ దృష్టిలో నేనూ, మీ నాన్న కూడా పనికిరాని పరమ సన్నాసులం – అనా ?

వసంత : అయ్యుండొచ్చు కోపం తెచ్చుకోకండి. వ్రతం రోజున ఈ జన్మమొగుళ్ళు ఆవేశపడకూడదట.

కేశవ : ( అక్కసుగా ) మరేం చెయ్యాలట ? పసుపు రాయించుకుని, పాలపీకె నోట్లో పెట్టుకుని పెళ్ళాం వెనకాలే తిరగాలా ?

వసంత : అబ్బ – మీకన్నీ అనుమానాలే – వుండండి, మొత్తం వ్రతవిధానాన్ని చదివి వినిపిస్తే ఏ గొడవా వుండదు. ( అనుకుంటూ టెలిఫోన్ బల్ల వైపుగా వెళ్ళింది )

కేశవ : ( ఆశ్చర్యంగా ) ఏమిటి ? దీనికో పుస్తకం కూడా ఏడ్చిందా ?

వసంత : ( బల్ల సొరుగులోంచి ఓ పుస్తకం బయటికి తీసి కళ్ళకద్దుకుని ) అట్లా తేలిగ్గా మాట్లాడకండి. అచ్చేసిన అయిదు రోజుల్లో యాభై వేల కాపీలు అమ్ముడయిపోయినాయిట. ఇహ – చదూవుతాను – శ్రద్దగా వినండి

( పస్తకంలో వున్నది చదవుతోంది )

ఈ సౌభాగ్య వ్రతము ముందు చూపుతో ఏర్పరచిన కార్యక్రమము. ఈ జన్మలో మీ బతుకు కాకిముకుక్కి దొండపండయిందని బాధపడక, మళ్ళీ జన్మంటూ ఒకటుందని ! అప్పుడూ మొగుడనే ఉపద్రవం వుంటుందని గ్రహించి భక్తితో, నమ్మకంతో ఈ వ్రతాన్ని త.చ. తప్పకుండా ఆచరించిన యెడల మరుజన్మలో మీ కష్టములు తొలగి, బుద్దిమంతుడూ , ఐశ్వర్యవంతుడూ , దైర్యవంతుడూ అందమైన భర్త లభించగలడు. ఇహ వ్రత విధానం!

కేశవ : ఈ పుస్తకాన్ని రాసి పుణ్యం కుట్టకున్నదెవరో ?

వసంత : తెలీదు – మధ్యలో అడ్డురాక ఇనండి

( చదువుతోంది ) వ్రత విధానము : ఆవిఘ్నమస్తు : ఈ వ్రతమును ప్రతియేటా

శూన్యమసములో శుక్ల పక్ష చవితి రోజున జరుపుకోవలెను. ఆ రోజున తొలిజామునే ఇల్లాలు నిద్రలేచి తలారా స్నానమాచరించి, పిమ్మట పెనిమిటిని కూడా పరుష వాక్యప్రయోగములతో కాక, స్నేహ పూరితవాతావరణంలో నిద్రలేపి, తలంటవలెను.

కేశవ : పడగ్గదిలోంచి సరాసరి నీళ్ళగదిలోకే అయితే, మరి కాఫీ, సిగరెట్టు బజారు కెళ్ళటం అన్నీ, బందా ?

వసంత : అన్నీ అయ్యాకే – కోపం తెప్పించక వినండి ( చదువుతోంది ) తలంటు కార్యక్రమం పూర్తి అయిన పిదప పెనిమిటికి పట్టు వస్త్రములు చుట్ట పెట్టవలెను.

కేశవ : అదీ విషయం –పట్టు బట్టన్ను మాంచి పొగాకు చుట్టా పెట్టాలి తలంటి పోసుకుని పట్టుబట్ట కట్టుకుని చుట్ట తాగుతూ కూర్చుంటాడన్నమాట మొగుడు.

గుడ్ – తర్వాత ?

వసంత : చుట్టపెట్టవలెను అంటే కట్టమనర్ధం. అంతేగాని, చుట్టలు, బీడీలు చేతికిమ్మని కాదు. అన్నీ చచ్చు అనుమానాలూ మీరున్నూ ( లెంప లేసుకుని ) వ్రతం రోజు అనకూడదు పాపం శమింగాక.

కేశవ : అంటే వసంతా ! వ్రతం రోజు మొగుడికి బట్టకూడా స్వయంగా పెళ్ళాలే కట్టాలా ?

వసంత : పెడర్థాలు లాగక బుద్దిగా వినండి. ( చదువుతోంది ) ఊఁ ఆ పట్టు వస్త్రములు చుట్టు పెట్టవలెను. తదుపరి వారిని పూజా గృహమునకు తోడ్కొని వెళ్ళి పసుపు కుంకుమలతో పవిత్రుడ్ని చేసి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న మందిరములో ప్రతిష్ఠించుకోవలెను.

అటు పిమ్మట వారిని రకరకములైన పుష్పములతో శక్తి కొలదీ అలంకరించుకొనవలెను.

( కేశవరావు ఇదంతా వింటూ పేథటిగ్గా మొహం పెట్టి కుర్చీలో కూలబడుతూ )

కేశవ : చాలు – ఇహ ఆపేయ్ వసంతా ఆపేయ్ – నాకేమిటో దడగా వున్నట్లుందే ?

వసంత : దడగా వుంటే కళ్ళు మూసుకుని గోడక్కానుక్కూర్చుని వినండి. నన్ను మాత్రం ఆపకండి. ( పుస్తకంలో పేజీలు తిప్పుతూ ) సరే – ఇదంతా పూజావిధానం – ( ఒక పేజీ వద్ద ఆగి చదువుతోంది ) ఆ పూజ పూర్తికాగానే టెంకాయలు కొట్టి.

కేశవ : ( భయంగా ) ఎక్కడా ? నేలమీదేనా ?

వసంత : భూమ్మీదేగాని, ఫ్లోరింగ్ ఖరీదైన యెడల ఏదైనా బండపైన కాని పగులగొట్టి, కొబ్బరినీళ్ళు, ఆవుపాలు, తేనే కలిపి పెనిమిటిపై చల్లవలెను.

కేశవ : వద్దే – చీమలు పీక్కుతింటాయే – సగం నువు తిని, మిగిలిన సగం చీమలు తింటే ఈ జన్మ మొగుడూ ఇహ నీకు మిగల్డు – తర్వాత నీ ఇష్ట.

వసంత : చాల్లేండి, హాస్యాలూ మీరూన్నూ ( మళ్ళీ చదువుతోంది ) అనంతరం, పదునాలుగవ పేజీలో వ్రత కథ చదువుకొని, కధాక్షతలు నాలుగు తనేసుకుని, మరో నాలుగు పెనిమిటిని చేతులారా స్వయంగా వేసుకోమని అదేశించి, కర్పూర నీరాజనానంతరం పెనిమిటి స్పృహలోకొచ్చురవకు పదహారవ పేజీలోని మంగళహారతులు పాడకుంటూ కాలక్షేపము చేయవలెను. ఈ విదముగా వ్రత మాచరించిన మంచి మొగుడొచ్చును.

కేశవ : వసంతా ! ఆగు కాస్తాగు. నన్ను – కొద్దిగా వూపిరి తిప్పుకోనీ హమ్మ – అంటే ఇపుడీ కార్యక్రమం మొత్తం నువ్వు కూడా ?

వసంత : సర్లేండి – కాకపోతే ఈ కంఠ శోషంతా నాకెందుకు? పదండి తలంటి పోస్తా.

కేశవ : అమ్మో – నాకొద్దు – ఆ పసుపు కుంకాలు, ఆ పూలు , ఆ పూజలు నావల్ల కానేకాదు – ఈ ఆలోచనలకే అదిరిపోతుంటే

వసంత : అంతేనా ! మాట వినరా ! పూచ్చేయించుకోరా .

కేశవ : వుహూ – నాకొద్దే వద్దు – నే ఆఫీసుకెడతా – స్నానం గూడా ఆఫీసులోనే చేస్తా ఇవ్వాళ్టికి –( వెళ్ళిపోయేడు )

వసంత : సరే వెళ్ళండి. పూజకొద్దీ పురుషుడని – అయినా ఇలాంటి ఇబ్బందులొస్తాయనే చిన్న సవరణ కూడా ఆఖరిపేజీలో చెప్పాడు.

కేశవ : ఏమిటది ? ఫోటో పెట్టి లాగించెయ్యమన్నారా ? నాకేం అభ్యంతరం లేదు. సూటిగా స్టూడియోకెళ్ళి కేబినెట్ సైజు కలరు ఫోటో తీయించిస్తా.

వసంత : ఆవేశపడకండి , అదేం కాదు ( చదువుతోంది ) ముఖ్య గమనికి : పెనిమిటి గ్రామంలో లేనియెడల గ్రామములో వుండి సహకరించనని మొండికెత్తిన. ఒక బ్రహ్మచారి కుర్రవాడ్ని భర్తగా తలంచి

కేశవ :  అమ్మో – ఆపెయ్యి, పద – నీళ్ళెక్కడ ! తలంటు

వసంత : అలా రండి దారికి – సరే – మీరెళ్ళి సున్నిపిండి రాసుకుంటుండండి, నే చిటికెలో బజారెళ్ళి పూజాసామిగ్రి  తెచ్చుకుంటా.

కేశవ : పూజాసామాగ్రంటే – వినాయకుడికి పెట్టినట్లు పాలవెల్లి, నేరేడు,  మారేడు. మావిడాకులు – ఇవా.

వసంత : అబ్బబ్బ అన్నీ  అనుమానాలే కదా ( చదువుతోంది ) పూజా సామాగ్రి వివరములు – అరటిపళ్ళు,  కొబ్బరికాయలు,  ఆవుపాలు, తేనే, పూలు , అగరవత్తులు, కర్పూరం, అప్పడాల కర్ర, కొబ్బరితాడు, మొగుడు లేక బ్రహ్మచారి కుర్రాడు.

కేశవ :  అప్పడాల కర్ర , కొబ్బరితాడు – అమ్మో, అవ్వెందుకే ?

వసంత : ఆయుధ పూజేమో సర్లేండి – ముందు మీకు తలంటి తర్వాత బజారెడతా పదండి
( హడావుడిగా లోనికి వెళ్ళిపోయింది )
( కేశవరావు ఆ వైపుగా చేతులు జోడించి )

కేశవ :  ఇదెక్కడ సంతే వసంతా ! మళ్ళీ జన్మ మొగుడికోసం  కళ్ళముందున్న వాడిని కాల్చుకుతినడం న్యాయమా ? ఈ వ్రతాల భార్యల బారినుంచి కాపాడేందుకు మాక్కూడా ఏదైనా వ్రతముంటే  చెప్పి పుణ్యం కట్టుకో ప్రభూ.
( కేశవరావు స్వగతం మొదలుపెట్టగానే, పాండురంగం బయటి నుంచి వచ్చి సీరియస్సుగా దేనికోసమో సొంతయింట్లో వెతుక్కుంటున్నట్టు తిరుగుతుండగా కేశవరావు స్వగతం పూర్తిచేసి, స్నేహితుడ్ని చూసి వులిక్కిపడి )

కేశవ : రేయ్ పీ ఆర్ నువ్వా ? ఎంత సేపయింది వచ్చి ?

పాండు : పీ ఆరేవిటోయ్ – వెధవ టెలిగ్రాం  భాషా నువ్వూనూ. పాండురంగం అన్లేవ్ ? అద్సరేగాని – వుదయాన్నే  శాపం తిన్న జానపద హీరోలాగా అదేవిట్రా  ఆ వేషం వంక చూస్తూ “ నన్ను రక్షించు ప్రభూ ”  అంటున్నావ్  సిస్టర్కీ, నీకు రిలేషన్స్‌గాని దెబ్బతిన్నాయా ?

కేశవ : ఏం చెప్పమంటావ్ ! వొరే పీ ఆర్ – అదే పాండురంగం  నిజంగా  నువ్వెంత అదృష్టవంతుడివిరా  ! పెళ్ళనే జైల్లో పడకుండా తెలివిగా తప్పించుకు తిరుగుతున్నావ్ !

పాండు : ఏడ్చినట్టే వుంది.  అది తెలివికాదు. నా ఖర్మ. వుద్యోగానికి , పెళ్ళికీ మీసాల బ్రాకెట్టేసి ఇదిగో ఇలా బజారుపాలయ్యాను ? డిగ్రీ వుంది. ఉద్యోగం ఇస్తారంటే చెయ్యి వీల్లేదు పక్క ఆఫీసులో  అడగమంటున్నారు. పోనీ  పెళ్ళి చేసుకుంటేనన్నా అదృష్టం  మారుతుంతేమోనని  ఆశపడితే ఆడపిల్లల  తండ్రులు ఛ - అవతలకి పో అంటున్నారు. ఎవళ్ళకీ పనికిరాని  ఈ బ్రతుకు లాగించడం ఎవర్ని వుద్ధరించన్రా ?

కేశవ :  ( కోపంగా ) అయిందా ?

పాండ : లేదు.  ఇంకా నే చెప్పుకోవాల్సిన డైలాగుంది.  ఇంటికి రాగానే. ఏవండీ కాఫీ తీసుకుంటారా ! టీ తీసుకుంటారా ? పోనీ  ఆల్రెడీ  ఏమన్నా తీసుకునే వచ్చారా ? మంచం వెయ్యనా, మజ్జిక్కావాలా ? స్నానం చేస్తారా  ? ఇలా పరామర్శించే పెళ్ళాంవుంటే ఇంకేం కావాల్రా లైఫ్‌లో...

కేశవ : ( సీరియస్సుగా ) ఇప్పుడీ సంగతి చెప్పటానికా పొద్దున్నే తగలడింది ?

పాండు : అబ్బే - వురేయ్ నాకో పెద్ద అవాంతరం  వచ్చి పడిందిరా. నువ్వే గట్టెక్కించాలి

కేశవ :  ఓనరు గది ఖాళీ చెయ్యమన్నాడా ?

పాండు : సర్లే వాడామాటని ఆర్నెల్లయ్యింది. ఏ అమృత ఘడియల్లో తొలిసారి ఆ మాటన్నాడోగాని , అప్పట్నించీ  అదే మాటమీదున్నాడు. పాపం అద్దె కూడా వద్దంటున్నాడు. ఇంతకీ అది కాదు విషయం .

కేశవ : మరేమిటి ?

పాండు:  ఛ - చెప్పటానికి, అడగటానికి  నాకే సిగ్గుగా వుందిరా, నిన్ను  చాలా సార్లు డబ్బులడిగాను. సిగ్గుపడ్లేదు. ప్యాంటు, షర్టు ఓ సందర్భంలో  అడిగాను. ఫీలవలేదు. వాచీ అడిగాను. సైకిలడిగాను. రేషన్ కార్డడిగాను, చివరకి  ఎలక్షన్లప్పుడు  సర్దాగా నీ వోటు నే వేస్తారాని  అడిగాను - చిర్నవ్వుతో  వేసుకో ఫో అన్నప్పుడు  కూడా నేబాధపడ్లేదు - కాని ఈ సారి అడగాలంటే....

కేశవ : అడగటానికింకేం మిగిలి చచ్చాయని ? వెధవ ఫోజూ నువ్వూనూ !

పాండు : ఛ - అలా అనకు  -రాజ్యం  వొదిలి పెళ్ళాంతో  అడవుల్లో కూర్చున్న  రావుడ్ని భరతడు  వొదిలేడా ? వెళ్ళి పాదుకులగడగలేదూ ? అంచేత

కేశవ : అంటే  - కొంపతీసి  నువ్వు కూడా  ఆ పనిమీదే వచ్చావా ?

పాండు : హమ్మ అర్ధమైంది గదా - ఎలా చెప్పాలాని మహా ఇదై పోయాననుకో. విషయం వెధవది  సెన్సిటివ్ ......అయినా....

కేశవ : ఛస్తే ఇవ్వను అయినా తెలీకడుగుతున్నా నీ చెప్పులేవైనాయ్. తాకట్టు పెట్టి వచ్చేవా ?

పాండు : (ఆశ్చర్యంగా) ఏవిటి ? చెప్పులు కూడా తాకట్టు పెట్టుకుంటారా ? ఎక్కడ్రా ? వెధవ జోకులూ నువ్వూను. సిల్లీ ఫెలో – వారే వుంటే వీరితో ఏం పనని – నా చెప్పులు పోయి చచ్చాయ్.

కేశవ : పోయినాయా ? ఎప్పుడూ ? ఎక్కడా ?

పాండు : నిన్న రాత్రి గుళ్ళో.

కేశవ : గుళ్ళోనా ? ఏ గుళ్ళో

పాండు : కష్టాల దేవుడు కోదండరావుడు – రామాలయంలో

కేశవ : అసలు గుళ్ళో కెందుకెళ్ళావ్.

పాండు : అంటే మసీదు కెళ్ళాలా . ఏదో ఇంటర్వ్యూ కాలొచ్చింది గదాని దేవుడ్ని " హలో " అందామని వెళ్ళాను తప్పా ?

కేశవ : ఏవిటి ? ఇంటర్వ్యూనా ! మరి చెప్పి తగలడవేం – ఏ ఆఫీసు ఎప్పుడు .

పాండు : అదేదో వూరిబయట అంటరాని దిక్కుమాలిన కంపెనీ. ఇంటర్వ్యూ మాత్రం ఇవ్వాళ్ళే ?

కేశవ : ఏవిటి ఇవ్వాళేనా ( ఆదుర్దాగా ) వొరే పాండురంగం రాకరాక వచ్చిన అవకాశం అందులో వూరి పొలిమేర్లకి పోవాల్సినవాడివి. మీటింగాపి త్వరగా వెళ్ళు.

పాండు : థాంక్స్, స్నేహం తియ్యగా వుంటుందని విన్నానేగాని, ఇంత తియ్యగా వుంటుందని ఇప్పుడే తెలిసొచ్చింది. వస్తారా – చెప్పులెక్కడున్నాయ్ !

కేశవ : ( వులిక్కిపడి ) అమ్మో . చెప్పులే – నావే నేనివ్వను, అయినా అవి పాడైపోయాయిరా – తెగి చచ్చేయి.

పాండు : ఫర్లేదు సర్దుకుంటా ( ఫిలాసఫిగ్గా ) తెలీనంత మాత్రాన చెప్పు చెప్పు కాకుండా పోతుందా చెప్పు ?

కేశవ : ( రిపీట్ చేసుకుంటున్నట్టుగా ) తెగినంత మాత్రాన చెప్పు చెప్పు ,...చెప్పు ....ఛ ( తెప్పరిల్లి చూసేసరికి పాండరంగం మూలనున్న చెప్పుల్ని చేతిలోకి తీసుకోవడం కనిపించి, పరిగెత్తి అతడ్ని ఆపు చేస్తున్న ధోరణిలో )

వొరే పొద్దున్నే సతాయించకూ, నాకున్న వే ఓ జత - అవి కాస్తా నీకిస్తే ఆఫీసుకెలా వెళ్ళేది.

పాండు : చక్కగా పెళ్ళయిన వాడివి. సెలవు ఎట్టి ఏదైనా ఓ ప్రత్యేక కార్యక్రమం పెట్టుకో రిలాక్సవ్వు.

కేశవ : సెలవుపెట్టి ఇంట్లోనా ? అందులో ఇవ్వాళ ?

పాండు : ఏం సెలవు పెట్టి ఇంట్లో కుర్చోకూడదా ?

కేశవ : కూడదు. పరమడేంజర్, ఎలా బయటపడాలా అని ఆలోచిస్తున్నా...

పాండు: ఎంచేతరా ?

కేశవ : ఏం చెప్పమంటావ్ ? పెళ్ళంటే అంతా ఆనందమే అనుకునే అమాయక వెధవ్వి ఇవ్వాళ నా వైఫ్ - అదేదో దిక్కుమాలిన వ్రతం చేసుకుంటోందిట. అసలది వ్రతంకాదు, వూచకోత.

పాండు : వూచకోతా ? ఆవిడ వూచ తరుక్కుంటే నీకెందుకురా బాధ ?

కేశవ : ఫ్చ్.... మొదట్నించి మొత్తం చెబితేగాని అర్ధం కాదు - అసలేవిటంటే ( అంటుండగానే వసంత అక్కడికొచ్చింది. వస్తూనే )

వసంత : ఇవాళ సౌభాగ్య వ్రతం చేసుకుంటున్నా అన్నయ్యగారూ - ఈ వ్రతంగాని ప్రతియేడూ నిష్టగా చేసుకుంటే.

కేశవ : ( కసిగా అందిపుచ్చుకుని ) వచ్చే జన్మలో మంచి మొగుడొస్తాట్ట.

పాండు : అదా విషయం. శుభం - ఇలాంటి వ్రతాలు, పూజలు, పెళ్ళాలు చేసుకుంటూ వుంటే మొగుళ్ళకెంత జయం ? అసలు నన్నడిగితే ఈ వ్రతాన్ని ప్రతిరోజూ చేసుకోవాలంటాను.

కేశవ : అంటావ్. నీ సొమ్మేం పోయింది ? బ్రహ్మచారి వెధవ్వి ?

వసంత : ఇదండీ వరస. నేనేవన్నా నీళ్ళు తోడమన్నానా, వంట చెయ్యమన్నానా ? కాస్తా స్నానం చేసి, ఆపాదాలిట్లా పడేయండి పూచ్చేసుకుంటా అన్నా. తప్పా అన్నయ్యగారూ.

పాండు : కాదమ్మా. కాదు . కాదని నేనే కాదు రెండ్రూపాయల బియ్యం తినేవాళ్ళు కూడా అన్లేరు. ఒరే కేశవా ? సిస్టర్ బాధపడుతోంది. వెళ్ళు, వెళ్ళి ఆ పూజేవిటో చేయించుకో. నా మాట విను

కేశవ : అలాగే – అలాగే చేయించుకుంటా కాని, నీకు మాత్రం చెప్పులివ్వను.

వసంత : చెప్పులా చెప్పులేవిటి ?

పాండు : చూడ్రా – సిస్టర్ ఎంత అమాయకురాలో – చెప్పులంటే ఏవిటో కూడా తెలీని మహాలక్ష్మిరా.

అది కాదు సిస్టర్ – అసలు విషయం ఏవిటంటే ఓ నెల రోజులక్రితం ఓ కంపెనీలో " ఉద్యోగాలున్నాయహో " అంటూ పేపర్లో ప్రకటన పడింది. సరే అప్లయ్ చెయ్యటం ధర్మంగదాని అప్లికేషన్ పడేసా, లక్కీగా ఇంటర్వ్యూకి రమ్మని పిలుపొచ్చింది

వసంతం : శుభంమరేవిటి ఆలస్యం ? డిగ్రీ కాయితం పోయిందా ?

పాండు : డిగ్రీపోయినా డోంట్ కేరనేవాడ్ని. కాని పోయింది డిగ్రీకాదు. చెప్పులు , కాలికి చెప్పుల్లేకుండా ఇంటర్వ్యూకెలా వెళ్ళేది ? చెప్పండి.....

వసంత : అందుకని మీ ఫ్రెండ్ చెప్పులు అడగటానికొచ్చావ్ – అంతేగా ?

పాండు : అంతే సిస్టర్ – అంతే వారే చెప్పులు నాకిచ్చి పాదాలేమో ఆవిడకియ్యి. నేనేమో ఇంటర్వ్యూ కెడతాను. ఆవిడేమో పూచ్చేసుకుంటుంది అని చెబుతుంటే కాదంటే కాదని మొరాయిస్తున్నాడు.

వసంత : ఏవండీ పాపం పోనీ సరే అనగూడదు !

కేశవ : ఏం వ్రతం రోజున చెప్పులు ఇప్పించిన చెప్పుకింద తేలులాగా పడుండే పెనిమిటి వచ్చును – అని రాసుందా ?

వసంత : అదేం లేదుగాని, వ్రతం రోజు మంచి పనులు చేసుకోమని రాసుంది.

కేశవ : వుందీ ! అయితే అస్సలు సరే అనను గాక అనను.

వసంత : అంతేనా ?

కేశవ : అంతే !

పాండు : అబ్బ ఇంత మొండివాడితో ఎలా కాపురం చేస్తున్నారండి ?

వసంత : ఏం చెప్పమంటారు. అందుకేగా ఈ వ్రతాలు , పూజలూ – సర్లేండి. నిన్న మా నాన్నగారు షూస్ మర్చిపోయి వెళ్ళేరు. అవిస్తాను. పనికొస్తాయేమో చూసుకోండి.

పాండు : టాంక్సు సిస్టర్ – ఎంతైనా ఆడవాళ్ళు ఆడవాళ్ళే, మొగవెధవలు మొఘవెధవలే !

కేశవ : ఇదిగో వసంతా – మీ నాన్నగారు తిరిగొచ్చిన కథలాగా రివ్వునొచ్చి అమ్మాయ్ నా షూస్ ఇలా ఇయ్యమ్మా అంటే మాత్రం నీదే పూచీ, నాకేం తెలీదు.

వసంత : నాన్న ఇవాళ వ్రతం కాబట్టి వీధిలోకి వెళ్ళరు. సాయంత్రానికి అన్నయ్యగారు తీసుకొచ్చి ఇవ్వనే ఇస్తారు.

పాండు : పువ్వుల్లో పెట్టి మరీ ఇస్తా.

వసంత : మరింకేం – సరే అనండి, వ్రతం పూజా కాదనకండి.

కేశవ : వ్రతం పేరెత్తేవో ఛస్తే వూ అన్ను – అంతే !

పాండు : అంతేనా ?

కేశవ : అంతే ! అంతే ! అంతే ?

పాండు : సిస్టర్ – లా అండ్ ఆర్డర్ చెయ్యి దాటిపోయింది ఆలస్యం చేస్తే " వ్రతకల్లోలం " మొదలయ్యేటట్టుంది. ఆ షూసేవో నా మొహాన పారేస్తే నేపోతా. తర్వాత వీడ్ని అదుపులోకి తీసుకోవచ్చు.

వసంత : నిజమేననుకోండి. కాని సౌభాగ్య వ్రతం రోజున భర్త అనుమతి లేనిదే ఏ పనీ చెయ్యకూడదని మొదటి పేజీలో స్పష్టంగారాసుందే ?

పాండు : దురదృష్ట దేవత ఎడం కాలితో తన్నింది.

కేశవ : అంచేత, ఇహ సెలవు పుచ్చుకో,

( అని లోనికి వెళ్ళబోయినంతలో ఫోన్ మ్రోగింది. పాండురంగం దగ్గర్లో వుండటం చేత రీసీవర్ని అందుకుని మాట్లాడసాగేడు )

పాండు : హల్లో అవునండి.... యస్.ఆయన్ ఫ్రెండనండి. ఇంకా నిద్రమంచం దిగలేదండి. మెసేజ్ చెప్పండి ఆ .... అహ.... అలాగే నండి....అలాగే ....ఇంతకీ మీ పేరేవిటన్నారు. ? అహ ...సర్లెండి....రైట్ ....( ఫోన్ పెట్టేసాడు )

కేశవ : ( ఆత్రంగా ) ఎవర్రా ?

పాండు : రాంగ్ నంబర్లె – మనకేం సంబంధం లేదు. ఇంతకీ నా సంగతి ఏం చేస్తారు ?

కేశవ : రాంగ్ నంబరయితే, ఆయన ఫ్రెండ్‌నండీ, ఇంకా నిద్దర్లేవలేదండీ చెప్తానండి, వగైరా

వాగుడంతా దేనికిట ? వసంతా చూసేవా ? వాడి పని కాలేదని అబద్దాలు ఎంత ధారాళంగా చెప్తున్నాడో ?

వసంత : అదేవిటండీ అన్నయ్యగారూ. ఆయన అబద్ధం ఆడితే అర్థం చేసుకోగల్ను. కాని మీరు – మీరు కూడా అసహ్యంగా....

కేశవ : నావంక అలా చూస్తావేరా – ఏం చెప్తావో చెప్పు.

పాండు : నిజం చెప్పనా ?

వసంత : చెప్పండి – దానికింత ఆలోచన దేనికి ?

పాండు : ఏరా – బాగా ఆలోచించుకో చెప్పమంటావా ?

కేశవ : చెప్పెయ్యవోయ్ – బెదిరింపేవిటి ?

పాండు: టెలిఫోన్ ఆపరేటరు వరలక్ష్మి ఇవ్వాళ మార్నింగ్ షిఫ్ట్‌లో వుందిట. చెప్పమంది ?

వసంత : వరలక్ష్మా ? అదెవరండీ .

కేశవ : ( కంగుతిని ) అదా... అది...అదే....అబ్బే....నాకేం తెల్సు ?

( అంటూ ఫ్రెండ్‌కి రహస్యంగా నమస్కారాలు విసురుతున్నాడు )

పాండు : అదేలే సిస్టర్ రాంగ్ నంబర్, ఆపిల్ల అంతా చెప్పి చివర్లో వీరభద్రరావుగారిల్లేనా అనడిగింది. కాదని పెట్టేసాను. అదీ విషయం

వసంత : కానీ, రాంగ్‌నంబరని చెప్పినట్టు నే విన్లేదే ?

కేశవ : విన్లేదా, చెప్పాడే పాపం. రెండు భాషల్లో చెప్పాడు అది సరేగానీ నువు లోపలికి వెళ్ళి ఆ షూస్ పట్టుకొచ్చి వాడికియ్యి, టై అవుతోంది పాపం

వసంత : హమ్మయ్యా వ్రతం పూటా ఎక్కడ కాదంటారోనని హడిలి ఛస్తున్నా. వుండండి తెస్తా.( లోనికి వెళ్ళింది )

కేశవ : థాంక్సురా. అదే రాంగ్ నంబర్‌కి సమాధానం చెప్పినందుకు. ఈ మధ్య రాంగ్ కాల్సు ఎక్కువైపోయాయనుకో, మొన్నకి మొన్న గ్యాస్ కంపెనీక్కొడితే పత్రికాఫీసు కెళ్ళింది.

పాండు : ( తాపీగా ) రెండింటికీ పెద్ద తేడా లేదుగాని. ఇందాకొచ్చింది కరక్టు కాల్. రాంగ్ కాల్స్ మొదట్లో రంజుగానే వుంటాయిగాని ( కడుపొస్తే అన్నట్లు అభినయిస్తూ ) బిల్లొచ్చినపుడే బాధలు మొదలయ్యేది. జాగ్రత్త సుమా.

కేశవ :  అలాగే థాంక్సు. బిల్లు రాకుండా జాగ్రత్తపడతాగా.

( వసంత లోపల్నించి వచ్చింది.  షూస్ తెచ్చి పాండురంగంముందు  వుంచింది. అతడు వాటిని చేతుల్లోకి తీసుకుని పరీక్షగా చూస్తూ )

పాండు : గుడ్ బావున్నాయిరా ముద్దొస్తున్నాయ్. వేసుకోబుద్ధి కావటంలేదు చేత్తో పట్టుకుని తిరగాలనిపిస్తోంది.

కేశవ : పోనీ నెత్తిన పెట్టుకెళ్ళు. చచ్చు  కబుర్లాపి ఇంటర్వ్యూ వేళవుతోందేమో త్వరగా తగలడు.

వసంత : అన్నయ్యగారూ, అసలు సరిగ్గా సరిపోతాయో లేదో చూసుకోండి.

పాండు : పరాయి వాళ్ళ వస్తువులు  ఎలా వున్నా సరిపెట్టుకోవాలమ్మా ?.....

కాస్త లూజయినట్లున్నాయ్. ఇట్సాల్ రైట్ నో ప్రాబ్లమ్...వస్తారా...

కేశవ :  పనికాగానే పట్టుకొచ్చి ఇచ్చెయ్.  వ్రతం రోజు మా వసంత మనసు నొప్పించడం ఇష్టంలేక  సరే అన్నానేగానీ...

పాండు : నిజాలకి  భయపడి  కాదంటావ్ – ధైర్యంగా వుండ్ర. చక్కగా పూజా అదీ చేయించుకో ఆ మారం  చేసినట్లు తెలిస్తే  మాత్రం  మరి  నాక్కోపం  వస్తుంది. నాక్కోపంగాని వస్తే కేవలం నిజాలే మాట్లాడతా. తర్వాత నీ ఇష్టం .....వస్తానమ్మా....

( షూస్ చేత్తో పుచ్చుకుని  బయటికి వెళ్ళిపోయాడు )

వసంత : నిజాలే మాట్లాడతానంటూ ఆ బెదిరింపేవిటండీ?

కేశవ : ( తేలిగ్గా  కొట్టి పారేస్తూ ) ఓ అదా – వాడిబొంద  అలా అంటాడు.  పట్టించుకోక. నరాలు కాస్త లూజయినట్టున్నాయ్ వెధవకి. పద వేళవుతోంది.

( ఇద్దరూ లోనికి వెళ్ళబోతుండగా  ఐరావతం ప్రవేశించాడు )

( వెనక చూపులు చూసుకుంటూ ఎవరో తరుముకొస్తున్నట్లు పరిగెట్టుకొచ్చాడు. ఆయసం వల్ల రొప్పుతున్నాడు. పంచకట్టు పైకి లాగి కట్టేడు. ఒళ్ళంతా విభూది రేఖలు, బొట్టు చెవితో  పూలు, ఒక చేతిలో  కాలుతున్న అగరవొత్తి ఇంకో చేతిలో ఫ్యాంటు, షర్టు  వ్రేలాడుతున్నాయ్)

వసంత : ( అయోమయంగా ) నాన్న  – మీరా ?

ఐరావతం : ( ఆయాసపడుతూనే ) మనం పరిగెడితే  – రొప్పుకాక పతకాలొస్తాయా ?

వసంత : పరిగెట్టుకొచ్చేరా ?  ఏమైంది నాన్న ? దేనికి ?

ఐరావతం : చెప్తాగానీ, అమ్మడూ  అలా వీధిలోకెళ్ళి మీ అమ్మగాని వస్తోందేమో చూడమ్మా ?

( వసంత అనుమానపు  చూపుల్తోనే బయటికెళ్ళింది )

కేశవ : ఏవిటి అత్తగారూ మీరు పరుగుపందెం వేసుకున్నారా ? అహ పోనీ  ఏదో సరదాపడ్డారే అనుకోండి. బందోబస్తుగా ఏ నిక్కరో  వేసుకుని ఫీల్డులోకి దిగాలే గాని, ఇలా పంచెతో  పరిగెడితే ఎంత రిస్కు ?

ఐరావతం : నీ పంచె పాడుగానూ .ఆపవయ్యా, అందరికన్నా  పెద్ద రిస్కులో పడి అల్లాడిపోతుంటేను....( అంతలో వసంత తిరిగొచ్చింది )

వసంత : అమ్మరావటంలేదు నాన్నా....

ఐరావతం :  హమ్మయ్య  బ్రతికించేవ్ ఆ కుర్చీ ఇటీడు.

కేశవ : ( కుర్చీ సర్దుతూ ) మీ వాలకం  చూస్తుంటే మీ పరుగు  వెనకాల పెద్ద విషాద కథేథో వుందనిపిస్తోంది. అత్తగారితో గొడవపడ్డారా ?

ఐరావతం : ( కుర్చీలో సెటిలయ్యి ) గొడవా నా శార్దమా  ? ఇవాళ అదేదో వ్రతంట- ఏం వ్రతం ?

వసంత : సౌభాగ్య వ్రతం.

ఐరావతం :  అద్గదీ, ఆ వ్రతంట, హమ్మో ....హమ్మో....నా ప్రాణాలు  కొరికేసిందనుకో, తెల్లారగట్ట నాలుగ్గంటలకే లేపి కూర్చోపెట్టింది.

ఆ బావిలో  సగర నీళ్ళు నా నెత్తిన  దిమ్మరించింది. వొళ్ళంతా ఇదిగో ముగ్గులూ , బొట్లూన్నూ. అక్షింతలతో  పూజ,  అరటిపళ్ళు నైవేద్యం ఏం చెప్పను. పగవాడి క్కూడా ఈ కష్టం రాకూడదు.

కేశవ : అంటే  ఇంతకీ  పూజ పూర్తయింది ?

ఐరావతం :  లేదు. సగం అయిందట .

వసంత :  నే చెప్పలా మా అమ్మ చాలా నిష్టగా, నిధానంగా చేసుకుంటుందని.

కేశవ : మరయితే ఎలా బయటపడ్డారు .

ఐరావతం :  ఏం చెప్పను, హారతి కర్పూరం  తెస్తానని అలా లోపలికెళ్ళగా చూసి ఇదిగో ఇలా పరిగెట్టుకొచ్చేసాను.

వసంత : ఎంత పన్చేసావ్ నాన్న.

కేశవ : మరి ? ఈ ఫ్యాంటూ, షర్టూ ?

ఐరావతం : నావే వేసుకునే టైం లేక చేత్తో పుచ్చుకు చక్కా వచ్చేసా. అమ్మాయ్ కాసిని మంచినీళ్ళియమ్మా.

వసంత : అలాగే ( లోనికెళ్ళింది )

కేశవ : మార్నింగ్ పూట రన్నింగ్ ప్రాక్టీసు చెయ్యని పెళ్ళయిన కొత్తలో ఎందుకు చెప్పారో ఇప్పుడర్థం అయింది. పరిగెత్తలేని మొగుడ్ని ఆ పరమేశ్వరుడు కూడా కాపాళ్ళేడు.

ఐరావతం : నిజం చెప్పావ్ – నా ఆయుష్షు కూడా పోసేసుకో. ఇంకో సంగతి పరమేశ్వరుడంటే గుర్తుకొచ్చింది కైలాసం వదలి గజాసురుడికి వరం ఇవ్వాలని శివుడు అర్జంటుగా భూలోకంలోకి ఎందుకు పరిగెట్టాడంటావ్ ?

కేశవ : అంటే కైలాసంలో పార్వతీదేవి కూడా ఇదే వ్రతాన్ని....

ఐరావతం : దేర్ యూ ఆర్ ! అదీ సంగతి !

కేశవ : ఆయన దేవుడు కాబట్టి ఏదో వంక చూపించి పరిగెట్టేడు. మనం సామాన్యులం కాబట్టి వంకలు, శంకలు లేకుండా వుత్తినే పరిగెడుతున్నాం, అంతే తేడా !

( వసంత నీళ్ళ గ్లాసుతో వచ్చింది )

వసంత : ఇదిగో నాన్నా వాటరు...

ఐరావతం : ఏవిటి మంచినీళ్ళడిగేనా ! ప్చ్ చూసేవా ? స్నానం చేస్తానని అడగబోయి, తాగటానికన్నానన్నమాట. మెదడు మొద్దుబారి ఏం చేస్తున్నానో , ఏం చెప్తున్నానో అస్సలు తెలీకుండా వుంది.

వసంత : స్నానం చేస్తారా ? వేణ్ణీళ్ళు రెడీగా వున్నాయ్ పదండి....

కేశవ : వెళ్ళండి వెళ్ళండి – వుడుకు నీళ్ళు పడితేగాని ఓపికరాదు. సాయంత్రంతలోపు ఎన్ని మైళ్ళు పరిగెత్తాలో ఏమో ?

( ఐరావతం ముక్కుతూ, మూలుగుతూ కూతురి వెనకాలే లోనికెళ్ళాడు. కేశవరావు వాళ్ళని పూర్తిగా వెళ్ళనిచ్చి, రెండడుగులు లోపలి గది ద్వారం వైపుగా వేసి, ఎవరూ రావడం లేదని నిర్ణయించుకుని ! చటుక్కుని ఫోన్ వద్దకెళ్ళి, నంబరు డయల్ చేసి తగ్గు స్దాయిలో మాట్లాడున్నాడు )

కేశవ : హల్లో.... వరం .ఆ నేనే,... కేశవని. ఫోన్ చేశావటగా. వాడా ? నా ఫ్రెండేలే.

వుత్త కల్చర్లెస్ ఫెలో - మార్నింగ్ షిఫ్టా ? అంటే ఇవినింగు ఫ్రీయేగా ? గుడ్ - అయితే డ్యూటీ అవగానే సరాసరి తాజ్‌మహల్ కొచ్చి ఫ్యామిలీ రూంలో వుండు త్వరగా వస్తాగా .... ష్యూర్....

వసంత : ఏవండీ ( లోపల్నించి అనుకుంటూ వస్తోంది )

కేశవ : ( కంగారుగా ) ఆ - అయితే మాత్రం ఇదిగో చూడు. రాంగ్ నంబర్ పరిస్ధితి అర్ధం చేసుకుని పెట్టెయ్యి.

( కోపంగా ఫోన్ పెట్టేశాడు )

వసంత : ఎవరండీ ?

కేశవ : ఎవడో ...రాంగ్ నంబర్ రంగనాధం. వాళ్ళావిడకి నెప్పులు మొదలైనాయిట. అంబులెన్స్ కావాల్ట - అంబులెన్స్. అవునూ, మావగారు నీళ్ళాడుతున్నారా ?

వసంత : సర్లెండి మీ హాస్యాలకేం గాని - ఏవండి. గబుక్కున వెళ్ళి అమ్మని పిల్చుకురానా ? మిగిలిన పూజ కూడా పూర్తి చేసుకుంటుందేమో పాపం ?

కేశవ : మిగిలిన పూజా ? మీ నాన్న ముల్లోకాల్లో ఎక్కడ దాక్కున్నా వెతికి పట్టుకుని మళ్ళీ మొదట్నించీ చేసుకుంటుందిలేగా, ముందు వాడికిచ్చిన షూస్ గురించి ఆలోచించు. కాళ్ళకి చెప్పుల్లేకుండా వచ్చేడు. అడిగేది ఖాయం, తరువాత నీ ఇష్టం.

వసంత : నిజమేనండీ ఇప్పుడేం చేద్దాం ?

కేశవ : పోనీ, జరిగింది జరిగినట్టు చెప్పేస్తే ?

కేశవ : చెప్పొచ్చు తీరా అంతా విని - ఏవోయ్ కేశవరావ్, కాలికి జోల్లు గూడా లేనివాళ్ళతోనా నీ స్నేహాలు ? అడిగినందుకు వాడికి సిగ్గు లేకపోయినా ఇవ్వటానికి నీకు లేకుండా పోయిందా ? అసలు నా లెవిలేవిటి . నీ లెవిలేవిటి . చెప్పుల్లేని నీ కాళ్ళ లెవిల్లేవిటి ? అంటూ లెవిల్ కచేరీ మొదలు పెట్టేడే అనుకో - నా పరువేం కాను.

వసంత : అది నిజమే - ఎంత నామర్దా . పోనీ అస్సలు నువ్విక్కడ మర్చిపోలేదని గట్టిగా దబాయిస్తేనో ? అసలే మెదడు మొద్దుబారి పోయిందని కూడా అన్నాడు.

కేశవ : దబాయించవచ్చు .అసలు నాకేం అనిపిస్తోందంటే- వాటిని మర్చిపోలేదు. ముందుచూపుతో కావాలనే ఇక్కడే వదిలి వెళ్ళాడేమోనని....

వసంత : అయ్యుండొచ్చు. అసలే నాన్నకి ముందు చూపు జాస్తి. మరయితే ఏం చేద్దాం ?

కేశవ : ( ఆలోచించి ) ఓ పన్జేద్దాం. పోయినాయని చిన్న అబద్ధం ఆడిద్దాం.

వసంత : మరి – సాయంత్రం అన్నయ్యగారు పట్టుకొచ్చి ఇస్తాడు. నాన్నగాని వాటిని చూస్తే.

కేశవ : అంచేత చెప్పాలంటే – మావగారూ మీ షూస్ పోయినాయఎ. అయినా వర్రీ కాకండి మా ఇంట్లో పోయినాయయ్ కాబట్టి మాధే బాధ్యత. అలాంటివే ఇంకో జత కొనిస్తాం అని చెప్పేసి రేపు ఆయన షూస్ ఆయనింటికి తీసికెళ్ళి ఇచ్చాం అనుకో. మన ప్రిస్టేజి పౌండు లెవిల్లో పెరిగిపోతుంది. ఆయనకే మాత్రం కోపం వున్నా రూపాయి లెవెల్లో పడిపోతుంది. ఏవంటావ్.

వసంత : ఏవంటాను. అసలే నాకు బుర్ర తక్కువ అందులో వ్రతం రోజుకూడాను. మీ మాటే ఫైనల్....

( అంతలో ఐరావతం ప్యాంటు తీసుకుని, షర్టు తొడుక్కుంటూవచ్చి రెండు తుమ్ములు తుమ్మి )

ఐరావతం : కాస్త కాఫీ ఇయ్యామ్మాని అడుగుదామనుకుని స్నానం చేస్తానని అడిగినట్లు తీరా నీళ్ళ గదిలోకెళ్ళాక అర్ధమైంది.

కేశవ : అంటే కాఫీ కావాలని అర్ధం తెలిసిందా ?

వసంత : కాఫీయేగదా, తెస్తానుండండి ( లోనికెళ్ళింది )

ఐరావతం : ఏ మాట కామాటే చెప్పుకోవాలి. అన్నట్లు – చెప్పుకోవాలంటే గుర్తొచ్చింది. ( గొంతుపెంచి లోపలికి వినబడేట్లుగా ) అమ్మాయ్ వచ్చేటప్పుడు షూస్ కూడా పట్రామ్మా, మళ్ళీ మామూలుగా ) ఆ ఏమిటి చెప్తున్నాను ? ఆ – గుర్తొచ్చింది – స్నానం చేస్తే ప్రాణం హాయిగా వుంటుందయ్యా. ఏమిటి అలా వున్నావ్. ఒంట్లో బాగాలేదా ?

కేశవ : ఒంట్లో బాగానే వుంది ఇంట్లోనే గొడవగా నిజంగా సరైన కంపెనీ దొరికితే కాశీ వెళ్ళిపోదావన్నంత విసుగ్గా వుందనుకోండి.

ఐరావతం : ( బుజ్జగిస్తున్నట్లుగా ) ఇవిగో కేశవరావ్. అమ్మాయ్ చిన్న పిల్ల తెలిసో తెలీకో తప్పు చేసిందనుకో నువ్వే సర్దుకుపోతుండాలి. నే చూడు మీ అత్తగారు కొట్టిన తిట్టినా ఛస్తే ఫీలవను. మన పెళ్ళామేగదా కొట్టింది. పక్కింటాడి పెళ్ళాం కొట్టలేదని సర్దిచెప్పుకుంటా. అప్పటికీ కోపం కంట్రోలు కాలేదనుకో సుబ్బరంగా ఏ పార్కుకో వెళ్ళి మీ అత్తగార్ని చెడామడా తిట్టేసుకుని అన్న మాచార్య కీర్తన పాడుకుంటూ

ఇంటికొచ్చేస్తా. ఒక్కోసారి పార్కుదాకా వెళ్ళే పరిస్ధితి గూడా వుండకపోవచ్చు. అప్పుడు టక్కున టాయిలెట్లోకెళ్ళి తలుపేసుకుని డిటో కార్యక్రమం. డ్యూటీ ప్రకారం చేసేసి బయటికొచ్చేస్తా. అలా వుంటేనే సుఖ సంసారం అవుతుంది.

కేశవ : మంచి సలహా ఇచ్చేరు జరిగిందంతా విని నేనిప్పుడు పార్కుకెళ్ళాలో, టాయిలెట్లో కెళ్ళాలో గూడా చెప్పండి.

ఐరావతం : వ్రతం గురించా !

కేశవ : అదో ట్రాజెడీ, అదలావుంచండి. నిన్న సాయంత్రం గుడిలో కెడదామండీ అంది. సరే, కార్యక్రమం మంచిదే కాబట్టి సరే అన్నా తీరా బయల్దేరే వేళకి మీ షూస్ పట్టుకొచ్చి సర్దాగా వేసుకొండి ఎలా వుంటాయో చూద్దాం అంది.

ఐరావతం : చిన్నపిల్ల సర్దాపడుంటుంది.

కేశవ : ఆ సరదాయే మీ ముందు తలెత్తుకోకుండా చేసింది ?

ఐరావతం : ( కంగారుగా ) ఏవైంది ?

కేశవ : చెప్తా వినండి. అక్కడికి చిలక్కి చెప్పినట్టు చెప్పా ఒద్దు. వసంతా నా మాట విను. ఎంత నాన్నయినా పరాయి వాళ్ళ సొమ్ము పావుతో సమానం ఒద్దా అని వూహూ వింటేనా ? ఛ మా నాన్న నాగయ్య లాంటివాడు, ఏమీ అనుకోడు. ఆ షూస్ వేసుకోండి. నాగేశ్వర్రావులా వుంటారంటూ వొకటే సొద, గొడవాను.

ఐరావతం : పోనీ వేసుకోలేక పోయావా ? భాగ్యవా బంగరవా ?

కేశవ : సరిగ్గా ఇలాగే నేనూ ఆలోచించి సరే లెమ్మని వేసుకుని గుళ్ళోకెళ్ళాను.

ఐరావతం : గుడ్, దర్శనం బాగా అయిందా ?

కేశవ : బ్రహ్మాండంగా అయింది.

ఐరావతం : మరేమిటి ప్రాబ్లమ్ ?

కేశవ : దర్శనం జేసుకుని కాస్సేపు కూర్చుని కొబ్బరి ముక్కలు తింటూ పక్కింటి వాళ్ళని గూర్చి మాట్లాడుకుని బయటికొచ్చేసరికి కాస్త ఆలస్యం అయింది. అప్పటికే మీ షూస్....

ఐరావతం : ( ఆదుర్దాగా ) ఆఅ అంటే పోయినాయా ?

( సరిగ్గా అదే సమయానికి వసంత కాఫీ గ్లాసుతో వస్తూ, తండ్రి చివరి మాటల్ని అందిపుచ్చుకుంటూ )

వసంత : పోక కూర్చుంటాయా నాన్నా మీ పిచ్చిగాని, అక్కడికి మొత్తుకుంటూనే వున్నా వొద్దండీ. అయన బూట్లు మీ కెందుకు ? కావాలంటే వింటేగా ?

( కేశవరావు ఇబ్బందిగా ఫీలవుతూ భార్యకి సంజ్ఞల ద్వారా ఏదో చెప్పాలని ప్రయత్నించి కుదరక, చివరకి కోపంగా )

కేశవ : వసంతా కాస్సేపు నోరు మూస్తావా ?

వసంత : అంతేలెండి, ఎంత సేపూ నోరు నొక్కేయ్యాలన్న ధ్యాస తప్ప వేరే మాటే లేదు. మా నాన్న మంచివాడు. పైగా ఆడ పిల్లని ఇచ్చుకున్నాడు కాబట్టి ఏం అనకపోవచ్చు కాని ఎంత నామర్దా ! ( కేశవరావు దిక్కులు చూస్తున్నాడు. ఐరావతం ఫిలసాఫిక్‌గా )

ఐరావతం : పోన్లే అమ్మ. పోయినవి నా షూసేగదా. పర్లేదు. మొగుడూ పెళ్ళాలు ఒక మాట మీదే వుంటే ముచ్చటగా వుంటుంది. రెండు మాటలొస్తే మూడోవాడికి మతిపోతుంది. ఆఫీసుకి టైం అయినట్టుంది వెళ్ళొస్తా.

వసంత : నాన్నా కాఫీ.

కేశవ : మామగారు పోనీ నా చెప్పులేసుకెళ్ళండి ఉత్త కాళ్ళతో ఎలా వెడతారు.

ఐరావతం : నా గురించి వర్రీ కాకండి అయినా పుట్టినప్పుడు చెప్పు తొడగలేదు.

పోయేటప్పుడు అవి వెంటరావు. నడుమ చెప్పు తొడగ సుబాటు కాదయా

కేశవ : “ విశ్వధాభిరామ వినురవేమ ” కాని వేమనగారు ఈ పద్యాన్ని బట్ట గురించి రాసినట్టు గుర్తు ?

ఐరావతం : రాసుండొచ్చు కాని నే చెప్పుల పైకి తిప్పేను. విరక్తిపుట్టినప్పుడు దేనిపైన కావాలంటే దానిపైకి తిప్పేస్తుంటాను. అవును ( భయంగా ) ఎవరో వస్తున్నట్టున్నారు.

( అంటుండగానే పాండురంగం ప్రవేశించాడు., వస్తూనే )

పాండు : ( కోపంగా ) ఏరా నా కొంప నిలువునా ముంచేశావ్ కదరా ?

( కేశవ రావు, వసంత అతడి రాకకి ఇబ్బందిగా ఫీలవుతుండగా ఐరావతం ఆసక్తిగా చూస్తున్నాడు )

వసంత : ఏవైంది, అన్నయ్యగారూ ?

పాండు : ఏం చెప్పమంటావమ్మా ఆ షూస్

ఐరావతం : ఏ షూస్..?

కేశవ : అవే లెండి. వీడు పాండురంగం అని నా బెస్ ఫ్రెండు, పి.హెచ్.డి చేసి షూమార్టులో పనిచేస్తున్నాడు. పోయిన మీ షూస్ లాంటివి ఓ జతకావాలని ఆర్డరిచ్చేను. దాన్ని గురించి వాడు చెప్పేడు ( ఫ్రెండ్స్‌తో ) రేయ్. ఆయన ఐరావతం గారని మా ఫాదరిన్లా, అర్ధమైందా ?

పాండు : అర్థమైందిగాని, క్రింద కాలెందుకు ఇందాకట్నించి తొక్కుతున్నావో మాత్రం అర్దం కావడంలేదు.

కేశవ : ఓ అదా అయామ్ సారీ....సో సారీ.

పాండు : నెవర్ మైండ్. అన్నట్టు బజార్లో మీ అత్తగారు కనిపించార్రా.

ఐరావతం : ఏమిటి నా వైఫా ? ఏమంది.

పాండు : అబ్బే నన్నేం అనలేదండి. నాయనా నువ్వు మా అల్లుడి ఫ్రెండువి కదూ అనడిగింది. అవునండి అన్నా. మావయ్యగారెక్కడన్నా కనిపించారా అనడిగింది. లేదండీ అన్నా. పాపం చాలా డిజప్పాయింటయ్యి, వర్షం వచ్చేస్తోంది, వర్షం వచ్చేస్తోంది అంటూ జాలిగా జపం చేసుకుంటుంట . నేనే ఏవండీ మీ అమ్మాయిగారింట్లో చూశార ? అడిగా. దాంతో ఆవిడ మొహం ఇంతయి అయ్యో ఆలోచన తట్టలేదూ అరటి పళ్ళు కొనుక్కుని అలా వెళ్తానంది. ఇంకారాలేదా ?

ఐరావతం : ( కసిగా ) ఇంకా రాల – వస్తుంది కూర్చో. సలహా ఇచ్చేట్ట. సలహా వాడేసిన టూత్ బ్రషల్లే మొహం వీడూనూ. అమ్మాయ్, ఇహ లాభం లేదు. నే వెళ్ళడం సేఫ్ ( పాండు రంగం పజిల్గా కేశవరావు వంక చూస్తుంటే, కేశవరావు తొందర పడొద్దని సంజ్ఞచేస్తుంటాడు )

పాండు : కాని అలా వీధిలోకి వెళ్ళగానే అత్తగారు ఎదురైతే ?

ఐరావతం : అవును అదీ నిజమే. ఏం చెయ్యటం ?

కేశవ : అందుకే కాస్సేపు అలా లోపలి గదిలో కూర్చోండి. అత్తగారొస్తే నే సర్ది చెప్పి పంపిస్తాగా.

పాండు : అత్తగార్ని మామగార్ని దగ్గరుండి గదుల్లోకి పంపించే అల్లుడు ఆసియా మొత్తంలో వీడొక్కడే.

ఐరావతం : ఏమిటి. అత్తగారొస్తే లోపలికి పంపిస్తావా ?

కేశవ : వాడి మాటలు పట్టించుకోకండి మీరిక్కడికి రాలేదని చెప్తా సరేనా.

ఐరావతం : ఆయనసలే  వైఫంటే వులిక్కి పడుతుంటే నువ్వేవిటి వెధవజోకులూ నువ్వూనూ ?

పాండు : లేకపోతే ? ఏరా నే పి. హెచ్.డి చేసి షూమార్టులో పన్జేస్తున్నానా ? నేనేమో వాడేసిన టూత్ బ్రష్‌లా వున్నానా ?

వసంత : ఛ – అసలా పోలికేతప్పు – వాడని బ్రష్‌లా ఉంటే.

కేశవ : వొరే – పాండూ ఆవేశపడకు. మొత్తం సంగతి మొదట్నుంచి  చెబితే  కోపం పోయి, మామగార్ని  వాటేసుకుని  ఆవురుమంటావ్. అద్సరే ఇంతకు ఇంటర్వ్యూ పూర్తయిందా ?

పాండు : ఆ – పూర్తిగా నాశనమైంది. ఆ దిక్కుమాలిన షూస్ పట్టుకుని అలా వీధిలో కెళ్ళానో  లేదో, పోలీసోళ్ళు పట్టేసుకున్నారు.

కేశవ : దేనికట, ఫిగరు చూసి డౌటు పడ్డారేమో ?

పాండు : అదేం కాదు. నిన్నగాక మొన్న  కొత్త మంత్రిగారి షూస్ పోయినాయట,. అచ్చం ఇలాంటివే. నిలబెట్టి యక్ష ప్రశ్నలు వేశారు.

కేశవ : అలాగా, ఏం చేశావ్.

పాండు : ఏం చేస్తాను .మొత్తం  కథంతా చెప్పి, ఆ బూట్లు నీ అడ్రస్సు  వాళ్ళ చేతుల్లో పెట్టి ఇదిగో ఇలా వచ్చేను.  వాళ్ళేమో  పరిగెట్టుకుంటూ స్టేషన్‌కెళ్ళారు.

వసంత : రైల్వేస్టేషన్‌కా  అన్నయ్యగారూ ?

కేశవ : కేశవ వూహూ . రేడియో స్టేషనకండీ చెల్లెమ్మగారూ ! లోపలికెళ్ళి ఫాదరేం చేస్తున్నారో చూసుకో – పో....

( వసంత గుర్రుగా చూసుకుంటూ వెళ్ళింది )

అది కాదురా. అసలు వాళ్ళు నిజం పోలీసులేనా ? ఈ మధ్యన వూళ్ళో సినిమా షూటింగులు జోరుగా సాగుతున్నాయ్. ఆ బాపతా ?

పాండు : చాల్లే వూరుకో – ఆ మాత్రం కనిపెట్టలేననుకున్నావా ? ఎప్పుడైతే పలకరింపులోనే బూతు మొదలయిందో అప్పుడే నిజం పోలీసులని  అర్థమైంది.

( సరిగా అదే సమయానికి ఐరావతం, వసంత లోపల్నించి వచ్చారు )

ఐరావతం : ఆ వంట గదిలో నేను కూర్చోలేను. హారిబుల్, నా వల్లకాదు. దాని కన్నా పూజ చేయించుకోవడం సుళువు. . నేనాఫీసుయికు పోతా – ( నాలుగడుగులు వేసి ) అక్కడక్కూడా మీ అమ్మ వస్తుందంటావా ?

వసంత : చెప్పలేం – అసలే అమ్మకి పట్టింపు ఎక్కువ. వర్షం రాకముందు పూజ పూర్తవ్వాలనుకుంటే వచ్చినా రావచ్చు ....

ఐరావతం : ఏం చెయ్యడం ? ( ఆలోచిస్తున్నాడు )

పాండు : ఎవరో వస్తున్నట్టుంది.

వసంత : అమ్మే అయ్యుంటుంది – ( ఆ మాట విని ఐరావతం కంగరుగా లోపలికి పరుగెట్టబోయి ఏదో గుర్తొచ్చినట్టు ఆగి )

ఐరావతం : ఆ కిచెన్లో కంపు – వెధవ కిచెన్లూ మీరున్నూ – ఏం చెయ్యటం ? ఆ – ఇదిగో నేనీ బల్లకింద దాక్కుంటా గాని, మీ అమ్మ గాని వచ్చీ అడిగితే నేనిక్కడికి రాలేదు, అసలేవవయ్యానో తెలీదు. అంతే.

( అనేసీ టపీమని టెలిఫోను బల్ల క్రిందకి దూరేడు. వెంటనే ఇద్దరు వ్యక్తులు లోనికొచ్చేరు. ఒకరు పూర్తి కోయివాడు గెటప్‌లో వున్నాడు. మరొకడు రోడ్డుపైన చిత్తుకాగితాలు ఏరుకునే వ్యక్తిలా నిక్కరు, చిరుగులు బనీను, భుజాన గోని సంచీ వున్నాయి.

ఇద్దరూ లోనికొచ్చేరు. కోయవాడు అక్కడున్న అందరివంకా తీక్షణంగా చూసి ముందుకు ప్రోసీడయి ఇంటిని, వస్తువుల్ని పరీక్షగా చూస్తుండగా, వెంట వున్న వ్యక్తి కడు భక్తిగా అతడ్ని ఫాలో అవుతున్నాడు )

( పాండురంగా, వసంత, కేశవరావు పజిల్లా ఒకరి మొహంలో ఇంకొకరు చూసుకుని )

కేశవ : ఇదిగో – ఎవరయ్యా – ఆ మిమ్మల్నే ?

కోయి : మీ ఇద్దర్లో కేశవరావంటే ఎవరు ?

పాండు : ఇదిగో – వీడే – ఏం– పులిగోర్లు, లేహ్యాలు, జింక చర్మాలు, మూలికలు వగైరా అమ్మాలనా ? మా వాడు ఛస్తే కొనడు ఏదైనా కొనే అలవాటే లేదు. అంచేత వేరే గిరాకీ చూసుకోండి.

వసంత : ఇదిగో మిమ్మల్నే – ఏం మాట్టాడకుండా ఏవిటా చూపులు, పచార్లున్ను –
బయటికెడతారా, మగాళ్ళని పిలవమంటారా ?

కేశవ : నువ్వు నోర్మూయ్. వెధవ్వాగుడూ నువ్వూను.

ఐరావతం : తప్పమ్మా అలా అనకూడదు ( బల్ల క్రిందనించే అనగా వచ్చిన వాళ్ళిద్దరూ అంతుపట్టక మొహాలు చూసుకున్నారు )

కోయి : ( రెండవ వాడితో ) ఇదిగో చూడు చూడూ – మన పర్సనల్ గొడవ వదిలేసి అఫీషియలంతా చెప్పేయ్.....

హెడ్డు : యస్సార్ ( సెల్యూట్ చేసి )
ఏలూర్లో మట్టా అటని మట్టి కరిపించేసి, విజయవాడ వ్యభిచారం కొంపలనీకన మాయం చేసి, గుంటూర్లో గూండా గాళ్ళందరి గూడారాలు పీకేపించేసి, రాజమండ్రిలో రద్దీ రోడ్లన్నిటికి వన్ వే పెట్టి ఒక వైపు ప్రజలచేత ఇంకోవైపు ప్రభుత్వం చేత సెభాషనిపించుకున్న సర్కిలే ఇన్స్పెక్టర్ సుబ్బరాజు గారు తెలుసా ?

పాండు : ఇంతకీ అడ్రస్సు అడగటానికొచ్చిన బాపతా ?

కేశవ : ( సీరియస్సుగా ) మీకేవన్నా బద్దుందా ! అడ్రస్సులడిగే పద్ధతేనా ఇది, అహా – ఇదేనా అంట – పదండి – బయటికి.

ఐరావతం : బయటిగ్గెంటు – వెధవల్ని ( బల్లకింద నుంచే )

వసంత : అమ్మో అమ్మో ..... అడ్రస్సు కావాలంటే గడపలో నిలబడి అడగాలి గాని, ఇలా సొంత మనుషుల్లా సరాసరి లోపలికి వచ్చి ఆ చూపులు చూడండి, దొంగ చూపులు వీళ్ళున్ను.

కోయి : ఆపండి. స్టాపిట్

హెడ్డు : అవును ఆపండి. ఏవిటలా అంత అడ్వాన్సయిపోతున్నారు. మగ్గురు మనుషులుంటే నాలుగ్గొంతులు వినిపిస్తున్నాయ్. అంతా గొడవగా వుంది. ఇంతకీ సుబ్బరాజుగారు తెలుసా అంటే – దానర్థం అడ్రస్సు అడగటం కాదు. వీరే ఆ సుబ్బరాజు గారని చెప్పటం – అండర్ స్టాండ్ ?

కేశవ : ఏవిటి ? వీరు సర్కిల్ సుబ్బరాజు గారా ?

పాండు : అంటే – ఇతను కానిస్టేబులా ?

హెడ్డు : హెడ్డు కానిస్టేబుల్ని. పేరు కొండ్రావు. పాతికేళ్ళుగా కాకీ బట్టల్లో కాలక్షేపం చేసేను. ఇంకో రెండేళ్ళ సర్వీసు తగలడింది.

కేశవ : మర్యాదగా బయటికి నడవండి – వీరు సర్కిలా ? నువ్వు హెడ్డువా చూట్టానికి బడితలల్లే వున్నారు. ఏ రిక్షా లాగో, మూటలు మోసో బ్రతకలేరూ ?

పాండు : కనీం అప్పులు చేసుకున్నా బతకొచ్చు గదా !

హెడ్డు : ( సెల్యూట్ చేసి ) సార్ – పరిస్థితి చెయ్యి దాటిపోయింది. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్స్ క్రియేటయ్యి దేశ భద్రతకే డేంజర్లాగా వుంది. మీరు వూ అనండి, మొత్తాన్ని మీసా కింద తోసేస్తా.

కోయి : ( తలకట్టులోంచి కార్డు తీసి ఇస్తూ ) ఇది నా అయెడింటీ కార్డు. చూడండి ( హెడ్డుతో ) ఆవేశపడకు. స్టేషన్‌కి తీసికెళ్ళేదాకా స్నేహంగా వుండాలి.

హెడ్డు : ( రహస్యంగా ) అలాగే ....సార్...సార్....ఇంకో సంగతి ....ఆ బల్లకింద ఎవరో వున్నట్టు డౌటుగా వుంది....

కేశవ : నిజంగా సుబ్బరాజు గారే.

పాండు : మరయితే ఈ వేషాలేవిటి ? పోలీసులకు యూనిఫాం మార్చేరా ?

హెడ్డు : అదేం కాదు. చూడండి – ఐ.పి.సి.గురించి అడగండి – చెప్తాం. మొన్న జరిగిన అల్లర్ల గురించి ,లాకప్పు చావుల, మానభంగాలు. దోపిడీలు, హత్యలు – ఏవైనా సరే అడగండి గడగడా చెప్పేస్తాను కాని –

కోయి : కాని మేం ఈ వేషాల్లో ఎందుకున్నామో అడక్కండి. అడిగినా చెప్పం.

హెడ్డు : ప్యూర్లీ పర్సనల్ – మా గొడవలూ, ఇబ్బందులూ మాకున్నాయ్.

కోయి : కమింగ్ టు ది పాయింట్ – ఆ బల్లకింద దాక్కున్న వాడెవడు ? అబద్దం చెప్పి ప్రయోజనం లేదు. ఊ.. వాడిని బయటికి రమ్మను.

హెడ్డు : బయటికి రారా – అలా చూస్తావేం ? వస్తావా ? నన్ను రమ్మంటావా ?

వసంత : ఆయన మా నాన్నగారండీ పేరు ఐరావతం.

కేశవ : మూడువేల రూపాయిల జీతం. పెద్ద ఉద్యోగం.

హెడ్డు : ఎక్కడా బల్లకిందా ?

పాండు : వేరే కంపెనీలో పులిలాంటి మనిషి గర్జిస్తే సందు సందంతా గడగడలాడిపోవాలి.

కోయి : ఓహో అలాగా ? బల్లకింద కూచోటానికికారణం.

పాండు : ఓ....అదా మీ డౌటు ? అదీ....అదీ వీడ్నడగండి....ఏరా ?

కేశవ : అబ్బే – కరక్టుగా తెలిచ్చావదు. ఆ గుర్తొచ్చింది. ఇలా రోజూ ఓ గంట బల్లకింద కూర్చుంటే బి.పి.కంట్రోలవుతుందని ఎవరో చెప్పార్ట.

( ఆ మాట ఇంకా పూర్తి కాకుండానే హెడ్డు చటుక్కున బల్ల క్రింద దూరేడు )

పాండు : అరె....హెడ్డుగారు కూడా....

వసంత : వారిక్కూడా బి.పి.వుందేమో ?

హెడ్డు : ( అక్కడ్నించే తల మాత్రం బయటపెట్టి ) సార్ – ఎగ్జామ్ చేసాను. గొప్ప అనుమానంగా వుంది. మొన్న ఢిల్లీ నుంచి వచ్చిన ఫోటోల్లో ఈ మొహం వుందని బాగా గుర్తు.

కోయి : ( వంగి చూసి ) యూ ఆర్ కరెక్టు. టెర్రరిస్టే. హెడ్డూ త్వరగా బయటపడు సీ – మిస్టర్ కేశవరావ్ – మీ మామగారని చెప్పబడిని ఈ వ్యక్తి మమ్మల్ని మారువేషాల్లో వున్నా సరే గుర్తుపట్టి బల్లకింద ఎందుక్కూచున్నారో అయిదు నిమిషాల్లోపలగాని చెప్పకపోతే హొటల్ మొత్తం అందర్ని తోలికెళ్ళాల్సి వుంటుంది.

కేశవ : మావగారూ, చిలికి చిలికి గాలివాన అయ్యేట్టుంది. నా మాట వినండి.

పాండు : అసలే రోజులు బాగాలేవు. అరెస్టు చేశారో – అంతే సంగతులు

వసంత : వచ్చేయ్ నాన్న – అమ్మ ఇహ రాదులే...

( ఐరావతం బయటికొచ్చేడు )

ఐరావతం : ఇంతమంది శ్రేయోభిలాషులు హామీ ఇచ్చేరు కాబట్టి వచ్చేను. ఏవైనా ఇక్కడుండడం మంచిది కాదు ( వెళ్ళిపోబోయేడు )

హెడ్డు : ఆగక్కడ ఏవిటా దూకుడు, సార్ ....బాగా అనుభవం వున్న టెర్రరిస్టులా వున్నాడు.

కోయి : సరైనా సమాధానం కావాలి....వూ....క్విక్....

ఐరావతం : ఏవిటండీ....ఇందాకట్నించీ చూస్తున్నా. నా కూతురింట్లో బల్ల కింద కూర్చోకూడదా ? అదేం నేరవా ?

హెడ్డు : నేరవే. ముమ్మాటికీ నేరవే – అందులో మమ్మల్ని చూసినప్పుడే ఎందుక్కూర్చోవాలి సార్ .....ఇలా కాదు. స్టేషన్‌కి తీసికెడితే తల్లో జేజెమ్మ చెప్తుంది.

పాండు : చూడండి, సుబ్బరాజుగారూ – నిజం చెప్పాలంటే కారణం డొమెస్టిక్ – ఇపుడు

మీరీ వేషాల్లో ఎందకున్నారో చెప్పారా ? లేదు – పర్సనలన్నారు. అలాగే వారికీ ఉండొచ్చుగా ?

హెడ్డు : వుండకూడదు – పోలీసోళ్ళకంతా పబ్లిక్కే.

ఐరావతం : అల్లుడూ – సుబ్బరాజుగారు సర్కిలయినా పెద్దమనిషిలాగా వున్నారు అంచేత నిజం చెప్పెయ్యడం ఉత్తమం. అయ్యా ! నా పేరు ఐరావతం....

హెడ్డు : ( నోట్ బుక్కులో రాసుకుంటా ) ఇంతకు మునుపే చెప్పారు.

ఐరావతం : నాకో భార్య గూడా వుంది. దాని పేరు....

వసంత : వెంకట సత్యసూర్య సాయి రాజేశ్వరి బాలకుమారి.

హెడ్డు : ఏవిటిది పేరా ? హౌరా ఎక్స్‌ప్రెస్‌లా ఇంత పొడుగుంది ?

ఐరావతం : ఇంతకీ చెప్పొచ్చేది – ఇవ్వాళ నా భార్య అదేదో వ్రతం చేసుకుంటోందిట. అదేం వ్రతం ?

కోయి : సౌభాగ్య వ్రతం !

కేశవ : కరెక్ట్ – మీకెలా తెలుసు – ( హెడ్డు చేతిలో పుస్తకం జారి క్రింద పడింది )

కోయి : ఇహనేం చెప్పొద్దు – ఆ పూజలకి పిచ్చెత్తి పారిపోయొచ్చి ఇలా బల్లకింద దాక్కున్నారు – అంతేనా ?

పాండు : అక్షరాల అంతే – ఇంతకీ ఇదంతా మీ కెట్లా తెలుసు ?

హెడ్డు : ఈ పూజలు మా కొంపల్లోను వున్నాయ్. ఇప్పటికయినా అర్ధమైందా ఈ అవతారాలెందుకు ఎత్తేమో ? మూడ్రోజులుగా ఇంటికెళ్ళకుండా రోజుకో వేషం వేసి అజ్ఞాతంగా డ్యూటీ చేస్తున్నాం.

కోయి : అమ్మో ! ఆ పూజ తల్చుకుంటేనే వొళ్ళు గగుర్పొడుస్తోంది. లాకప్ చావు బెటరు. నాగ్గానికోపం వస్తే దాన్ని క్లోజ్‌రేంజ్‌లో కాల్చేసి వెళ్ళి లాకప్‌లో ముకేష్ పాటలు పాడుకుంటూ కూచోగల్ను. కాని పిల్లలు – వాళ్ళ మొహాలు చూసి....

హెడ్డు :సార్ ! బాధపడకండి సార్. పోలీసోళ్ళు కళ్ళ నీళ్ళెట్టుకుంటూ అసహ్యంగా వుంటుంది. ఏడ్పించడమే కాని ఏడవడం తెలీనివాళ్ళం.

కేశవ : ఇంతకీ, మీరు ఇక్కడికెందుకొచ్చినట్టు – దాక్కోడానికా ?

కోయి : యస్.అసలు సంగతి – మీ ఫ్రెండుకి మీరిచ్చిన ఆ షూస్ ఏ షాపులో కొన్నారు ?

కేశవ : అవి ....అవి ...నావికావండి...

హెడ్డు : మీవెలా అవుతాయ్. అవి బసవన్నగారివి.

ఐరావతం : అంటే – అల్లుడూ నా షూస్ నువ్వేసుకోవడం, గుళ్ళోకెళ్ళడం అవి పోవడం అంతా.

పాండు :( ఐరావతం మాటను పట్టించుకోనట్టు ) బసవన్నా ! ఆయనెవరు ?

హెడ్డు : మొన్నటిదాకా మామూలు ఏమ్మెల్యే. కాని ఇప్పుడు మా డిపార్ట్ మెంట్ మంత్రి. అలా ప్రమాణ స్వీకారం చేశారు. ఇలా పాదరక్షలు పోగొట్టుకున్నారు.

కోయి : గుళ్ళో మా దొరగార్ని పిల్చి ఇల్లుకన్నా గుడి పదిలం అంటారు. కాని గుళ్ళోనే నా షూస్ పోయినాయి. ఏవిటీ పరిస్థితని కేకలేసి షూస్ గుర్తులు చెప్పి వెంటనే ట్రేస్ చేయండని ఆర్డరేసారు.

హెడ్డు : ఇదిగో మేమిలా వీధుల్నపడి ప్రతివాడి కాళ్ళు పట్టుకు చూస్తున్నాం.

కోయి : అలా చూస్తుండగా దొరికాడు ఆ పాండురంగం... ఆయ్ ..అనంగానే అంతా చెప్పేశాడు.

వసంత : పోనీ అలాంటి షూస్ ఓ జత బజార్లో కొని మంత్రిగారికిచ్చేసి  పరువు కాపాడుకోవచ్చుగదా !

హెడ్డు : సార్, ఈవిడ మన డిపార్టమెంటుకి పనికొచ్చేలా వుంది, చూడమ్మా నేరం నెత్తిమీద వేసుకునే మనిషి కోసం

కేశవ : అంటే మీ వుద్దేశ్యం ?

పాండు : మీ మావగార్ని నేరం ఒప్పేసుకోమని, అయినా హెడ్డుగారు తెలీకడుగుతా, ఈ చిన్న నేరం ఒప్పేసుకునేందుకు మీకు మనిషి  దొరకలేదా ?

హెడ్డు : దొరక్క కాదు – కాని కొత్త మంత్రిగారు కాబట్టి కొత్తవాళ్ళని  ఎంకరేజ్ చేద్దామని, కొత్త మొహాల్ని బోన్లో నించో పెడదావని.

కోయి : హెడ్డూ, స్టేషన్కి ఫోన్చేసి కాల్సు ఏవన్నా వచ్చేయేమో కనుక్కో ( హెడ్డు సెల్యూట్ చేసి ఫోన్ వైపుగా వెళ్ళేడు ) ఇంతకీ ఆ షూస్ మీకెలా వచ్చేయో చెప్పనేలేదు.

కేశవ : అవి నిజానికి నావికావండి. ఇదిగో వీరివి ( ఐరావతాన్ని చూసేడు )

( సర్కిల్ ఐరావతాన్ని ఏదో అడగబోతుండగా హెడ్డు ఫోన్లో మాట్లాడడం వినిపించి

అంతా వినసాగేరు )

హెడ్డు :ఎవరయ్యా మాట్లాడేది ? త్రీ నాట్ సిక్సా ? ఆ .... నేను హెడ్డు కొండల్రావుని....ఏవైనా ఫోన్లొచ్చాయా ? ఆ...ఆ,....దొరగారు ఇక్కడే వున్నారు. నే చెప్తా. నువ్వు ఫోన్ దగ్గరే తగలడు – మేం వచ్చేదాకా. ఏవిటి తెల్సిందా ? ఆ... అమ్మగారొచ్చేరా ? ఏం చెప్పావ్ ? గుడ్....నా వైఫ్ వచ్చినా అలాగే చెప్పు....వుంటా ( ఫోన్ పెట్టేసేడు )

కోయి : ఏవిటయ్యా అది ?

హెడ్డు : కొంప మునిగింది సార్. దాదాపు పాతిక. ముప్పై మంది ఆడవాళ్ళు చేతిలో పళ్ళేలతో ముఖ్యమంత్రిగారి బసకెళ్ళి మా మొగుళ్ళు మాచేత పూజలు చేయించుకోకుండా పరారైపోయారు. మాకు న్యాయం కావాలని మెమొరాండం ఇచ్చి ప్రదర్శన జరిపారట.

దాంతో సీయమ్ముగారు ఎంతో ఫీలయ్యి, నా ఆడపడుచులు నీళ్ళడిగారా, కరెంటడిగారా లేక రూపాయికే బియ్యం కావాలనడిగారా, పూజలక్కూడా పేచీలయితే వాళ్ళ ఆత్మ గౌరవం ఏం కానని కమిషనర్ గార్ని పిచ్చి పొద్దువాలే లోపు వీళ్ళ మొగుళ్ళని మిగతా అన్నిరకాల కేసులు ప్రక్కన పెట్టి ముందీ వ్యవహారం చూడమని అన్ని స్టేషన్లకి వైర్లెస్ మెస్సేజస్ పంపారట. మనక్కూడా వచ్చిందట, ఒక్కో స్టేషన్ వాళ్ళు పదిమంది మొగుళ్ళని పట్టుకుని ప్రోగ్రస్ చూపాలట.

కోయి : అయ్ సీ .....ఈ పెళ్ళాలు సామాన్యులు కారు. ప్రభుత్వాలనే పడగొట్టెయగల్రు. త్వరగా పద.

వసంత : పొద్దుట్నుంచి ఈయనా ఒక్కటే గోల – పూచ్చేయించుకోనని కాస్తా ( కళ్ళెర్రచేసి ) చెప్పండి. పుణ్యం వుంటుంది.

హెడ్డు : సార్. హాయిడియా !

కోయి : ఏవిటది ?

హెడ్డు : ఇప్పుడు మనం సాయంత్రంలోపు పదికేసులు ప్రోగ్రస్ చూపించాలి కదూ !

కోయి : అవును అయితే !

హెడ్డు : ఇప్పుడీ ఐరావతంగార్ని వారి భార్యకప్పగించేసి, కేశవరావుని ఆదేశించి ఈ రెండు

కేసులూ డైరీలో వ్రాసేస్తే ?

కోయి : గుడ్ ఐడియా ! అరెస్టు మీ ఐరావతం !

ఐరావతం : అన్యాయం, అన్యాయం ప్లీజ్ హెల్ప్ !

హెడ్డు : షటప్. అరిచేవంటే పూజలూ, వుద్యాపన్లూ ఇక్కడే చేసేయగల్ను జాగ్రత్త

( చెయ్యి పుచ్చుకున్నాడు )

కేశవ : దిసీజ్ టూ మచ్. నే కోర్టుకెళ్ళి స్టే తెచ్చుకుంటా ( వెళ్ళబోయేడు )

కోయి : ఆగక్కడ. కాలు కదిపావంటే కాల్చి పారేస్తాడంతే. మిస్టర్ కేశవ రావ్, మర్యాదగా మీరు కూడా చట్టానికి లోబడి, మీ ఆవిడ చేత పూజలు చేయించుకోమని బాధ్యతగల పోలీసు ఆఫసర్‌గా ఆదేశిస్తున్నా.

వసంత : అయిందా. ఇహ పదండి తలంటికి. సర్కిలన్నయ్యగారు కాస్త పూజయ్యేవరకు ఓ కానిస్టేబుల్ని కాపలా వుంచకూడదూ ?

కోయి : అలాగేనమ్మా ! ఓ పోలీసేం ఖర్మ మొత్తం, మిలట్రీని దింపించేయగలం – మొగుళ్ళని కాళ్ళూ చేతులూ కట్టిపడేయడానికి.

పాండు : అంటే – మరి – మీరు, హెడ్డు కూడా మీ మీ పెళ్ళాలకి సరండరయిపోతారా ?

హెడ్డు : ఛస్తే కాము – ఏ రూల్సయినా ప్రజలగ్గాని, మాక్కాదు. అండర్ స్టాండ్ !

కేశవ : ఈ పాదపూజల్ని, పతి సేవల్ని ఇలా చట్టబద్ధం చేస్తే ఈ మగ జాతి గతేం కాను ?

పాండు : " ఏ చరిత్ర చూసినా ఏవుంది గర్వకారణం ? మగజాతి సమస్తం – సతిపీడన పరాయణం " అంటూ పాడుకుంటూ బ్రతకాల్సిందే.

ఐరావతం : ఈ విశాల ప్రపంచంలో మా మొర విని, మమ్మల్ని ఆదుకునే నాధుడే లేడా ?

పాండు : ఏడవకండేడవకండి. నే నున్నా నే నున్నా

( ప్రతిజ్ఞ చేస్తున్న ధోరణిలో అంటున్నాడు )

ఈ పాండురంగానికి కనువిప్పు కలిగింది. లక్ష్యం తెలిసింది. కర్తవ్యం గోచరించింది. ఇన్నాళ్ళు పాపిష్టి వుద్యోగాల వేటలో పవిత్రమైన కాలాన్ని వృదా చేసేశాను. కాని వినిపించింది – మొగుళ్ళ నిశబ్ద రోధనం – అదిగో వినబడడం లేదా ? రండి – రండి కదిలిరండి. ఈ వ్రతకల్లోలాల్నించి మగ జాతిని వుద్దరించకుందాం –

" అఖిల భారత భర్తల సమాఖ్య జిందాబాద్ నారీపీడిత భర్తల్లారా

ఐరావతం & కేశవ : ఏకంకండి – ఏకంకండి ?

హెడ్డు : సార్ – చూడబోతే ఉగ్రవాదిలా వున్నాడు. కేసు గురించి తర్వాత ఆలోచిద్దాం తోసెయ్యనా ?

కోయి : పనికొస్తాడు – తోసెయ్యి...

మెడ్డు : యస్ సార్ : ( సెల్యూట్ కూడా చేసేడు )

హెడ్డు ఐరావతాన్ని, పాండురంగాన్ని చెరో చేత్తో పుచ్చుకుని బయటికి దారి తీస్తుండగా, వసంత భర్తని పట్టి లోపలికి లాగుతోంది. పాండురంగం అవేశంగా స్లోగన్సు ఇస్తున్నాడు )

పాండు : వ్రతాలూ, పూజలూ !

ఐరావతం & కేశవ : మాకొద్దూ – మా కొద్దూ

పాండు : పాద పూజలూ, పతి సేవలూ

ఐరావతం & కేశవ : మా కొద్దు – మా కొద్దు

( అరుచుకుంటూ తలో వైపుకి వెడుతుండగా )

------ తెర -------

( సమాప్తం )